కూతురికి 'సిందూర్' పేరు

పాట్నా: బీహార్‌లోని కటిహార్ జిల్లావాసి కుందన్ కుమార్ మండల్ అప్పుడే పుట్టిన తన కుమార్తెకు సిందూర్ అని నామకరణం చేశారు. ఉగ్రవాద స్థావరాలపై భారత దళాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తనకు ఎంతో గర్వకారణమని చెప్పారు. ఈ స్ఫూర్తితోనే తన కుమార్తెకు సిందూర్ పేరు పెట్టానన్నారు.

దేవుడా పాక్‌ను నువ్వే కాపాడాలి

- మేము అనేక పాపాలు చేశాం
- పాక్ పార్లమెంట్‌లో ఎంపీ కన్నీరుమున్నీరు
- ఆ దేశ పరిస్థితికి అద్దం పడుతున్న వీడియో

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. ఇప్పటికే ఆ దేశం అంతర్జాతీయ సమాజాన్ని సాయం చేయాలని కోరుతున్న సంగతి తెలిసిందే. తాజాగా పాకిస్థాన్ ఎంపీ సాక్షాత్తూ పార్లమెంట్‌లో 'దేవుడా భారత్ నుంచి పాకిస్థాన్‌ను కాపాడు' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఈ వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పాకిస్థాన్ ఆర్మీ రిటైర్డ్ మేజర్, ఎంపీ తాహిర్ ఇక్బాల్ బుధవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో మాట్లాడారు. 'మనది బలహీనమైన దేశం. అందుకే మనందరం కలిసి.. ఓ దేవుడా మా దేశాన్ని నువ్వే కాపాడాలి అని ప్రార్థిద్దాం. ఈ దేశం ప్రార్థనల నుంచే పుట్టింది. మా నేతల కలలోకి అల్లా వచ్చి, పాకిస్థాన్ దేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించాడు. మీ కృపతో సాకారమైన దేశాన్ని ఇప్పుడు మీరు మాత్రమే కాపాడగరని ఆ దేవుడిని ప్రార్థిద్దాం' అంటూ ఎంపీ తాహిర్ ఇక్బాల్ కన్నీరుమున్నీరయ్యారు. 'ఓ అల్లా.. మేం పాపాత్ములం. అనేక పాపాలు చేశాం. మమ్మల్ని క్షమించు. మేము మీ ముందు మేం తలవంచుతున్నాం. మీ దయ మాపై ఉండాలని వేడుకుంటున్నాం' అంటూ వెక్కి వెక్కి ఏడ్చారు. ఎంపీ తాహిర్ వ్యాఖ్యలు ఆ దేశ పరిస్థితికి అద్దం పడుతున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

- ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాక్ ఆర్మీ అధికారులు

భారత్ జరిపిన వైమానిక దాడిలో మరణించిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరైన పాక్ ఆర్మీ అధికారులు, ఇతర అధికారులు. ఈ దృశ్యమే ఉగ్రవాదానికి పాకిస్థాన్ ఊతమిస్తున్నదని ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నది. ఇదే విషయాన్ని భారత్ అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్తున్నది.

సైన్యంలో చేరుతా.. ఉగ్రవాదులపై పోరాడుతా

- పహల్గాం ఉగ్ర దాడి మృతుడి కుమారుడి ప్రతిన
- ఆపరేషన్ సిందూర్‌తో సంతృప్తి కలిగిందని వ్యాఖ్య

బాలాసోర్: పాకిస్థాన్ ఉగ్రవాదులను ఎదుర్కోవడానికి భారత సైన్యంలో చేరాలనుందని ఒడిశాకు చెందిన తొమ్మిదేండ్ల తనూజ్ కుమార్ సత్పతి అన్నాడు. గత నెల 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో అతడి తన తండ్రి ప్రశాంత్ సత్పతిని కోల్పోయాడు. తనకు ప్రధాని మోదీని కలిసే అవకాశం వస్తే తన లాగా మరే చిన్నారి తండ్రి లేని వారు కాకుండా చూడాలని కోరతానని తనూజ్ గురువారం బాలాసోర్ జిల్లాలోని తన ఇంట్లో మీడియాతో మాట్లాడుతూ అన్నాడు. 'నా తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి నేను సైన్యం చేరాలని నిర్ణయించుకున్నాను' అని తన తల్లి సమక్షంలో అతడు వ్యాఖ్యానించాడు. 'బుధవారం ఉదయం నుంచి మేం వార్తలు చూస్తున్నాం. అవి నాకు, మా అమ్మకు చాలా సంతృప్తిని ఇచ్చాయి. మేం మన ఆర్మీ పట్ల గర్విస్తున్నాం' అని ఆపరేషన్ సిందూర్ గురించి తనూజ్ తెలిపారు. సైన్యంలో చేరాలన్న తన కొడుకు కోరిక నెరవేర్చేందుకు తాను ఏం కావాలన్నా చేస్తానని అతడి తల్లి ప్రియదర్శిని వెల్లడించారు. అయితే తన కొడుకు బాల్యాన్ని కోల్పోయినట్లు అనిపిస్తున్నదని.. అతడికి హఠాత్తుగా పరిణతి రావడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు జాగృతి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

- ఎమ్మెల్సీ కవిత నేతృత్వం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా శుక్రవారం తెలంగాణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సంస్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పీపుల్స్ ప్లాజా నుంచి 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం వరకు సాగనున్న ఈ ర్యాలీకి తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వం వహించనున్నారని పేర్కొన్నది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఈ ఆపరేషన్ సిందూర్‌ను ప్రతిఒక్కరూ బలపరచాలని, వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి ప్రజలంతా వెన్నుదన్నుగా నిలవాలని జాగృతి సంస్థ విజ్ఞప్తి చేసింది. ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చింది.

'ఆపరేషన్ సిందూర్'పై దుష్ప్రచారం చేస్తే చర్యలు : సీఎస్‌బీ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : 'ఆపరేషన్ సిందూర్'పై ఎవరైనా దుష్ప్రచారం చేస్తే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ఈ మేరకు తమ ఎక్స్ అధికారిక హ్యాండిల్‌లో పోస్టు పెట్టింది. 'సోషల్ మీడియాలో చాలామంది ఆపరేషన్ సిందూర్ గురించి తప్పుడు వార్తల ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. దీంతో ఎంతోమంది భయభ్రాంతులకు గురవుతున్నారు. దుష్ప్రచారం నిరోధానికి మేము సోషల్ మీడియాను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు' అని హెచ్చరించింది. ఇలాంటి పోస్టులు ఎవరికైనా కనిపిస్తే వెంటనే 8712672222 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సీఎస్‌బీ కోరింది.

ప్రొఫెసర్ సుజాతపై చర్యలు తీసుకోవాలి

సీఎంకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ లేఖ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): భారత సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా 'ఆపరేషన్ సిందూర్'ను కించపరిచేలా పోస్టులు పెట్టిన రాష్ట్ర విద్యాకమిషన్ అడ్వైజరీ సభ్యురాలు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'ఆపరేషన్ సిందూర్'పై దేశం గర్వపడుతున్న సమయంలో భావోద్వేగాలను రెచ్చగొట్టేలా, సైన్యాన్ని కించపర్చేలా సుజాత సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారని ఆయన మండిపడ్డారు. సుజాతను తక్షణమే అడ్వైజరీ బోర్డు నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్ సుజాతపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

కరీంనగర్ విద్యానగర్/ జగిత్యాల మే 8: రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై దేశద్రోహం కేసు నమోదుచేయాలని కరీంనగర్, జగిత్యాల పోలీసులకు బీజేపీ, భారత సురక్ష సమితి నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తే దానిని తప్పుబట్టేలా వ్యవహరించడం ముమ్మాటికీ దేశద్రోహమేనన్నారు. జగిత్యాలలో భారత సురక్ష సమితి నాయకులు టౌన్ సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా

ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 8 : తాను సోషల్ మీడియాలో పెట్టిన పోస్టును వెనక్కి తీసుకుంటున్నానని శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక పరిశోధకురాలిగా యుద్ధం అంటే భయంతో, అందులో మరణించే పసిపిల్లలు గుర్తుకు వచ్చి పోస్ట్ చేశాను తప్ప.. దేశ భద్రత, సైన్యం, ప్రభుత్వంపై అగౌరవంతో కాదని స్పష్టంచేశారు. తన వ్యాఖ్యలు ఎవరినీ కించపరిచేవి కావని, ఎవరైనా బాధపడినా, మనోభావాలు దెబ్బతిన్నా క్షమించాలని కోరారు.

సోషల్ మీడియాలో పాక్ దుష్ప్రచారం

- భారత ఫైటర్ జెట్లను కూల్చామంటూ పోస్టులు
- కథనాలు ప్రచురించిన ఆ దేశ మీడియా

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): భారత్‌తో యుద్ధం గెలువలేవని తెలిసిన పాకిస్థాన్.. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ మానసికంగా తృప్తి పొందుతున్నది. భారత్ దాడి చేస్తుంటే పాక్ ఆర్మీ ఏం చేస్తున్నదని, నిఘా వ్యవస్థ నిద్రపోతున్నదా? అంటూ పాకిస్థాన్ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పాక్ రక్షణ వ్యవస్థపై ప్రపంచవ్యాప్తంగా అనుమానాలు మొదలయ్యాయి. దీంతో పరువు నిలబెట్టుకునేందుకు పాక్ దుష్ప్రచారాన్ని నమ్ముకున్నది. బుధవారం భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూల్చేశామంటూ పాక్ ప్రధాని, రక్షణ శాఖ మంత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పాత ఫొటోలను పోస్ట్ చేస్తూ భారత్‌కు చెందిన ఫైటర్ జెట్లను కూల్చేశామంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేసింది. పాక్‌కు చెందిన మీడియా సంస్థలు సైతం ఐదు భారత విమానాలను కూల్చామంటూ కథనాలు వండి వార్చాయి. అయితే ఇదంతా ఉత్తదే అని స్వయంగా పాకిస్థాన్ రక్షణ మంత్రి ఒప్పుకున్నారు. మంత్రి ఖవాజా మహ్మద్ ఆసిఫ్‌ను గురువారం అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్ఎన్‌లో జరిగిన ఓ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ రిపోర్టర్.. 'భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూల్చేశామని చెప్తున్నారు. ఇందుకు ఏమైనా ఆధారాలు ఉన్నాయా? ఉంటే చూపించండి' అని ప్రశ్నించారు. దీంతో పాక్ మంత్రి కంగుతిన్నారు. 'అంతా సోషల్ మీడియాలోనే ఉన్నది. ఫొటోలు, వీడియోలు కనిపిస్తున్నాయి. నేను కూడా అక్కడే చూశాను' అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో 'అధికారికంగా ఏమైనా ఆధారాలు చూపెడతారా?' అని విలేకరి ప్రశ్నించగా పాక్ మంత్రి నీళ్లు నమిలారు. దీంతో పాక్ చేస్తున్న దంతా ఒట్టి ప్రచారమని, కేవలం పరువు నిలబెట్టుకోవడానికే తమ దేశ పౌరులను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తున్నదని అర్థం అవుతున్నది. మరోవైపు ఈ దుష్ప్రచారం కొనసాగుతూనే ఉన్నది. భారత్ ప్రయోగించిన 25 డ్రోన్లను తాము కూల్చివేశామని, ఇవి ఇజ్రాయెల్‌లో తయారయ్యాయని గురువారం ప్రకటించింది. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్లు మరోసారి విమర్శలు మొదలు పెట్టారు. భారత్ ఇంకా దాడి చేయలేదు.. మరి డ్రోన్లు ఎలా కూల్చారంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. ఫైటర్ జెట్ల శకలాల మాదిరిగానే పాత, ఫేక్ ఫొటోలు పెట్టి ప్రచారం చేసుకుంటారా? అంటూ మండిపడుతున్నారు.

మసూద్ అజర్ సోదరుడు హతం

ఆపరేషన్ సిందూర్‌లో గాయపడి రవూఫ్ మృతి

1999లో భారత విమానం హైజాక్‌కు సూత్రధారి

26/11 సహా అనేక ఉగ్రదాడుల్లో పాత్రధారి

దాడిలో దెబ్బతిన్న పూంచ్‌లోని గురుద్వారాను పరిశీలిస్తున్న స్థానికులు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ ఉగ్రవాది, భారత్‌లో జరిగిన కీలక ఉగ్రదాడుల్లో పాత్రధారి అబ్దుల్ రవూఫ్ అజర్ హతమయ్యాడు. పదుల సంఖ్యలో అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్న రాక్షసుడు బహావల్పూర్‌లో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో తీవ్రంగా గాయపడి మరణించినట్టు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురితం అయ్యాయి. బుధవారం బహావల్పూర్‌లోని జైషే కేంద్ర కార్యాలయంపై జరిపిన దాడిలో రవూఫ్ తీవ్రంగా గాయపడ్డారని, చికిత్స పొందుతూ రాత్రి మరణించారని పేర్కొన్నాయి. ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్‌కు రవూఫ్ సోదరుడు. 1999లో భారత్‌కు చెందిన ఐసీ - 814 విమానాన్ని హైజాక్ చేసిన ఘటన వెనుక మొత్తం సూత్రధారి రవూఫ్. అంతేకాదు.. అతడి సోదరుడు మసూద్ అజర్ భారత్‌లో 2001లో కశ్మీర్ అసెంబ్లీ, పార్లమెంట్‌పై జరిపిన ఉగ్రదాడి, 26/11 ముంబై దాడులు, 2016లో పఠాన్‌కోట్‌లోని వైమానిక స్థావరంపై జరిపిన దాడిలో, పుల్వామా దాడిలో రవూఫ్ కీలక పాత్ర పోషించాడని చెప్తున్నారు. అతడు పాకిస్థాన్ ప్రభుత్వానికి, ఐఎస్ఐకి మధ్య వారధిగా పనిచేస్తున్నాడని చెప్తున్నారు.

అత్యవసర సమావేశాలు..

భారత్ దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌లో హై అలర్ట్ ఇంకా కొనసాగుతున్నది. గురువారం ప్రధాన మంత్రి షెహబాజ్ ఆర్మీ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. ఆర్మీ తీసుకునే చర్యలకు ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. గురువారం తెల్లవారుజామున భారత్ మరోసారి తమపై దాడి చేసిందని పాక్ ప్రకటించింది. ఇజ్రాయెల్ తయారు చేసిన 25 ఆత్మాహుతి డ్రోన్లను భారత్ ప్రయోగించిందని, వాటిని తాము కూల్చేశామని ప్రకటించింది. మరోవైపు పంజాబ్ తదితర సరిహద్దు రాష్ట్రాల్లో స్కూళ్లకు సెలవులను 11వ తేదీ వరకు పొడిగించింది. అన్ని శాఖల అధికారుల సెలవులను రద్దు చేసింది. కరాచీ ఎయిర్‌పోర్ట్‌ను మూసి వేసింది.

పాకిస్థాన్ భీతావహం

మొదటిపేజీ తరువాయి...

రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసిన భారత్ గురువారం రాత్రి దర్జాగా శత్రుదేశంలోకి చొచ్చుకుపోయింది. పెషావర్‌లో భారీ పేలుడు సంభవించిందని, లాహోర్, సియాల్‌కోట్, కరాచీ, రావల్పిండి నగరాలలో కూడా పేలుళ్లు సంభవించినట్టు సైనిక వర్గాలు తెలిపాయి. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో ప్రధాని ఇంటి సమీపంలోనే భారీ పేలుడు సంభవించిందని పేర్కొన్నాయి. దీంతో ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు తెలిసింది. ఆయన బంకర్‌లో తలదాచుకున్నట్టు సమాచారం. పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ కూడా సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. హైసెక్యూరిటీ జోన్లంటిలోనూ భద్రతను పెంచారు. అన్ని ప్రధాన నగరాల్లోనూ హైఅలర్ట్ ప్రకటించారు. క్వెట్టాలోని సైనిక స్థావరం లక్ష్యంగా భారత్ దాడి చేసింది. ఈ దాడులన్నింటినీ అరేబియా సముద్రంలో మోహరించిన భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి పర్యవేక్షించినట్టు సమాచారం. తాము దూకుడు వైఖరిని అవలంబించామని ఇండియన్ నేవీ ధ్రువీకరించింది. 26 భారత యుద్ధనౌకలను రంగంలోకి దింపినట్టు వార్తలు వెలువడుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో పాక్ గగనతల హెచ్చరిక, నియంత్రణ వ్యవస్థ (అవాక్స్) విమానాన్ని భారత దళాలు కూల్చివేశాయి. సరిహద్దులోని జమ్ము-నౌషెరా సెక్టార్‌లో పలు పాక్ సైనిక పోస్టులను భారత్ ధ్వంసం చేసింది. దీంతో పాక్ సైన్యానికి భారీ నష్టం సంభవించినట్టు తెలిసింది. భారత భూభాగంలో పాక్ డ్రోన్లు, మిస్సైళ్లను కూల్చివేసిన సైనిక దళాలు ఆ తరువాత శత్రుదేశంలోకి చొచ్చుకుపోయి బీభత్సం సృష్టించింది. దీంతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పాక్ ప్రధానితో మాట్లాడి ఉద్రిక్తతలను నివారించాలని సూచించారు. సౌదీ విదేశాంగ మంత్రి సైతం శుక్రవారం పాకిస్థాన్ చేరుకోనున్నారు.

గురువారం కరాచీలో భారత డ్రోన్ల దాడిలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న పాక్ జవాన్

బలూచ్ తిరుగుబాటు దళాల చేతుల్లోకి క్వెట్టా

భారత్- పాక్ యుద్ధవాతావరణాన్ని ఆసరాగా చేసుకుని బలూచిస్థాన్ విమోచన సేన రాజధాని క్వెట్టాను స్వాధీనం చేసుకున్నది. బీఎల్ఏ ధాటికి తట్టుకోలేక పాక్ సైన్యం చేతులెత్తేసింది. క్వెట్టా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సైనిక స్థావరాలపై బీఎల్ఏ జెండా ఎగురవేసింది. బలూచ్‌లోని పర్వత ప్రాంతాల్లో పాక్ సైనిక వాహనాన్ని తిరుగుబాటుదారులు పేల్చివేయడంతో 12మంది సైనికులు మృతిచెందారు.

పాక్ కంటెంట్‌పై నిషేధం

ఉత్తర్వులు జారీచేసిన కేంద్రం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ కంటెంట్‌ను, ఆ దేశ ప్రేరేపిత కంటెంట్‌ను ఓటీటీల్లో నిషేధిస్తూ గురువారం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. నిషేధం తక్షణం అమల్లోకి వస్తుందని కేంద్రం తెలిపింది. ఈ ఉత్తర్వుల్లో పలు కీలక అంశాలను కేంద్రం ప్రస్తావించింది.

ఈ కంటెంట్‌లపై నిషేధం..

- భారత సార్వభౌమాధికారానికి, సమగ్రతకు భంగం కలిగించే ఏ విధమైన కంటెంట్‌ను కూడా ఉపేక్షించవద్దని నిర్ణయించింది.
- దేశ భద్రతకు సవాల్ విసరడంతోపాటు బెదిరింపు ధోరణితో ఉండే కంటెంట్‌పై నిషేధం.
- విదేశాలతో మన దేశ స్నేహ సంబంధాలకు హాని కలిగించేలా ఉండే విషయాలు.
- హింసను ప్రేరేపించి ప్రజల్లో శాంతికి భంగం కలిగించే ఏ విధమైన కంటెంట్ ప్రసారాలు నిలిపివేత.
- ఐకమత్యాన్ని దెబ్బతీసేలా ఉండే కంటెంట్.
- భారత్‌పై ఉగ్రదాడుల్లో పాకిస్థాన్ యాక్టర్ల పరోక్ష ప్రమేయం ఉండటం వల్ల అలాంటి కంటెంట్‌ను కూడా ప్రసారం చేయవద్దని కేంద్రప్రభుత్వం ఆదేశించింది.
- జాతీయ భద్రతని దృష్టిలో ఉంచుకుని పాకిస్థాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, మధ్యవర్తిత్వం ద్వారా ప్రసారమయ్యే కంటెంట్ నిలిపివేత. పాకిస్థాన్ వెబ్ సిరీస్‌లు, సినిమాలు, పాటలు, పాడ్‌క్యాస్ట్‌లు సహా మీడియా కంటెంట్ అందుబాటులో ఉంచకపోవడం. సబ్‌స్క్రిప్షన్, సహా ఇతర మార్గాల ద్వారా కంటెంట్ పొందుతున్నవారికీ ఇందులో మినహాయింపు లేదు. ఓటీటీ వేదికలు పాకిస్థాన్ కంటెంట్‌ను భారత్‌లో స్ట్రీమింగ్ చేయడానికి వీల్లేదు.

సైన్యానికి తెలంగాణ ప్రజల మద్దతు

సంఘీభావ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 8(నమస్తే తెలంగాణ): 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రవాదాన్ని అణిచేందుకు పోరాడుతున్న భారత సైన్యానికి తెలంగాణ ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పాక్ పాలకులు, ఉగ్రవాదులు ఎవరైనా సరే భారతదేశ సార్వభౌమత్వంపై దాడి చేయాలనే చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిన సైన్యానికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం నుంచి నెక్లెస్‌రోడ్డు వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'మా నేలపై కాలుమోపి మా ఆడబిడ్డల నుదిటి సిందూరాన్ని తుడిచేయాలనుకునే ఉగ్రమూకలకు ఆపరేషన్ సిందూరే సమాధానం' అని ఆయన స్పష్టంచేశారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, క్లిష్ట సమయాల్లో పార్టీలు, జెండాలు, ఎజెండాలను పక్కనబెట్టి దేశరక్షణకై అంతా ఒకటి కావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, శ్రీధర్‌బాబు, పొన్నం మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

3 గంటలు ముందే రావాలి

ప్రయాణికులకు ఎయిర్‌లైన్స్ సూచన

న్యూఢిల్లీ : ప్రయాణికులు విమానాశ్రయాలకు తమ విమానాలు బయల్దేరే సమయానికి మూడు గంటలు ముందుగానే రావాలని విమానయాన సంస్థలు కోరాయి. పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో భద్రతను ప్రభుత్వం కట్టుదిట్టం చేసిన నేపథ్యంలో ఇండిగో, ఆకాశ ఎయిర్, ఎయిరిండియా సహా అనేక విమాన యాన సంస్థలు ఈ మేరకు ప్రయాణికులకు విజ్ఞప్తి చేశాయి. విమానం బయల్దేరడానికి 75 నిమిషాల ముందు చెక్‌ఇన్‌ను క్లోజ్ చేయనున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఆదేశాల నేపథ్యంలో విమానయాన సంస్థలు ఈ అడ్వయిజరీని ప్రకటించాయి. విమానాశ్రయాల టెర్మినల్ భవనంలోకి సందర్శకుల ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు బీసీఏఎస్ ప్రకటించింది. భద్రతా ఏర్పాట్లను మెరుగుపర్చటంలో భాగంగా అన్ని విమానాలకు సెకండరీ లాడర్ పాయింట్ చెకింగ్‌ను బీసీఏఎస్ తప్పనిసరి చేసింది. దేశంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విమానాశ్రయాలు, వైమానిక స్థావరాలు, వైమానిక దళ స్టేషన్లు, హెలిప్యాడ్స్, ఏవియేషన్ శిక్షణ కేంద్రాలు..సహా అన్ని పౌర విమానకేంద్రాల వద్ద భద్రతా చర్యలను పెంచాలని నిర్ణయించాం' అని బీసీఏసీ పేర్కొన్నది.

పెండ్లయిన రెండు రోజులకే బార్డర్‌కు!

- నాడు కార్గిల్ యుద్ధంలో భాగంగా ఆపరేషన్ పరాక్రమ్
- రిటైర్డ్ ఆర్మీ సోల్జర్ మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి

ఆర్మీ మెడల్స్‌తో రాజేందర్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 8 : తాను పెండ్లయిన రెండు రోజులకే విధుల్లో చేరినట్టు సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ సోల్జర్ మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్మీలో 14 ఏండ్లపాటు సేవలందించినట్టు చెప్పారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో తన అనుభవాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. '1993లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో ఆర్మీ ట్రైనింగ్‌లో చేరా. విధుల్లో భాగంగా పంజాబ్‌లోని పెరోజ్‌పూర్ బార్డర్‌లో పనిచేశా. 1999లో ఇండియా-పాకిస్థాన్‌కు మధ్య కార్గిల్ యుద్ధం వచ్చింది. ఆ సమయంలో బార్డర్‌లోనే ఉండి సేవలు అందించిన. అనంతరం ఉగ్రవాదులు భారత పార్లమెంట్‌పై 2001లో దాడులు చేశారు. దానికి అనుగుణంగా ఆర్మీ ఆపరేషన్ పరాక్రమ్ తీసువచ్చింది. ఆ సమయంలోనే 2002 మే 24న నాకు వివాహం జరిగింది. ఆర్మీ నుంచి పిలుపు రావడంతో వివాహం జరిగిన రెండు రోజులకే బార్డర్‌కు వెళ్లిన. ఆపరేషన్ పరాక్రమ్ దాదాపుగా 45 రోజులపాటు సాగింది. ఆపరేషన్ పరాక్రమ్‌లో భాగంగా పంజాబ్, పాకిస్థాన్ బార్డర్ పెరోజ్‌పూర్‌లో విధులు నిర్వహించిన. 14 ఏండ్లపాటు ఆర్మీలో సేవలు అందించిన. కంటి సమస్య కారణంగా రిటైర్ అయినట్టు' రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌తో పాక్ మైండ్‌బ్లాక్

'నమస్తే తెలంగాణ'తో మాజీ ఆర్మీ మేజర్ భరత్‌రెడ్డి



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ మైండ్‌బ్లాక్ అయ్యిందని, ఇప్పుడు అది దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని మాజీ ఆర్మీ మేజర్ భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఆయన 'నమస్తే తెలంగాణ'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు. పాకిస్థాన్ పూర్తి అప్రమత్తంగా ఉండగానే భారత్ అక్కడి ఉగ్రవాద అడ్డాలపై మెరుపుదాడులు చేసి తమ సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందని అన్నారు. భారత సేనలను అపలేకపోవడంపై పాకిస్థాన్ ప్రజలు అక్కడి ప్రభుత్వంపై పూర్తి అపనమ్మకంగా ఉన్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్ ఇటీవల తామే ఇస్లాంకు సుప్రీం అని, ముస్లిం శరణార్థులకు తామే ఆశ్రయమిస్తామంటూ ఒక పోస్టర్‌ను విడుదల చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో తాము వెనక్కు తగ్గితే తమ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోతుందన్న భావనలో ఉన్నదని అన్నారు. పాకిస్థాన్ పరిస్థితి ఇప్పుడు 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి'లా మారిందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే అది కయ్యానికి కాలుదువ్వుతూ చివరకు తమ క్షిపణి నిరోధక వ్యవస్థను కాపాడుకోలేని పరిస్థితి తెచ్చుకుందని అన్నారు. పాక్ దూకుడు దానికే భస్మాసుర హస్తంలా పరిణమించిందని చెప్పారు. ఓవైపు భారత్‌తో కయ్యం, మరోవైపు అంతర్గతంగా బలూచిస్థాన్, సింధు, ఖైబర్ పఖ్తుంఖ్వాలో వేర్పాట